అల్లూరి సీతారామరాజు

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి–దుంబ్రిగుడ: ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక మండల కేంద్రంలో బుధవారం జరిగింది. మండల అధ్యక్షుడుగా కే.కాందేవ్, ఉపాధ్యక్షులుగా వి రామన్న, కార్యదర్శిగా ఎస్.రాంబాబు, సహాయ కార్యదర్శిగా ఏ.సుందర్రావు, ట్రెజరర్‌గా వి.ప్రోతిమ మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులు

'అన్నదాత'తో ఆర్థిక భరోసా

-జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్- జిల్లాలో 1,44,222 మంది గిరిజన రైతులకు లబ్ధి

రైతును సత్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి –పాడేరు: రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ – పి యం. కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన అన్నదాత సుఖీభవ – పి.యం.కిసాన్ పథకాన్ని సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో భాగంగ అన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్' పథకానికి .నగదు జమను వర్చువల్‌గా కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ప్రారంభోత్సవం జరిగింది. పాడేరు కాఫీ హౌస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, పాడేరు తెలుగుదేశం నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి తిలకించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 22 మండలాల్లో 1 లక్షా 44 వేల 222 మంది గిరిజన రైతులకు ఒకొక్కరికి రూ.7 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమ చేయడం జరుగుతుందన్నారు. అరకులోయ అసెంబ్లీ స్థానంలో అరకులో య, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుం పేట, పెదబయలు, ముంచంగపుట్టు మండలాల్లో 56,404 మందికి, పాడేరు నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో 48,473 మందికి, రంపచోడ వరం పరిధిలోని రంపచోడవరం, అడ్డతీ గల, రాజవొమ్మంగి, వై.రామవరం, వీఆర్.పురం, దేవిపట్నం, గంగవరం, కూనవరం, ఎటపాక, చింతూరు, మారేడుమల్లి మండలాల్లో 40,270 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమ చేయడం జరిగిందన్నారు. రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకం ప్రభుత్వం అందిస్తుందన్నారు. డబ్బులు జమకాని లబ్దిదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, 155251 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియ జేయాలని సూచించారు. ఉద్యాన పంటలకు ప్రాధకన్యత నివ్వడం జరుగుతుందని , రైతులు గ్రూపులుగా ఏర్పడాలన్నారు. గ్రూపులో ఉన్న రైతులకు అధిక ఆదాయం రావడానికి అవకాశం ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా (ఐటిడిఎ) ని ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు.

పాడేరు తెలుగుదేశం నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, ఎఎంసి చైర్మన్ మత్స్యయల మంగతల్లి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, ట్రైకార్ డైరెక్టర్ కె కృష్ణా రావు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు మాట్లాడుతూ, ఎన్నికలకి ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ ప్రతీ హామీ లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులను సన్మానించి అన్నదాత సుఖీభవ – పియం. కిసాన్ పథకం చెక్కును లబ్దిదారులకు అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్. నంద్ అన్నదాత సుఖీభవ – పియం. కిసాన్ పథకం వివరాలను లబ్దిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెటింగ్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, పాడేరు ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ చైర్మన్ దక్కోడి వెంకట రమణ, లగిసిపల్లి సర్పంచ్ పార్వతమ్మ, పాడేరు ఎంపిపి నాగరత్నం, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, ఎంపీటీసీ గూడెపు ఉషారాణి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అన్నదాతల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా చిన్నలబుడు పంచాయతీకి వెళ్లి గిరిజన రైతులతో ముచ్చటించిన దొన్నుదొర వారి సమస్యలు, ఆదాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బుధవారం అరకులోయ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల రెండో విడతగా రాష్ట్రం, కేంద్రం కలిసి ఒక్కో రైతుకు రూ.7000 చొప్పున చెల్లించనున్నట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లోక్కోయి మహదేవ్, డుంబ్రిగూడ మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బోరిబోరి లక్ష్మి,మాజీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు,అరకు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు సుబ్బారావు,యువనాయకుడు కిల్లో శ్యామ్, సచివాలయం వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు భగత్ రామ్, గుండు బాబు,సుబ్బారావు, బాలు దొర పాల్గొన్నారు.

అరకులోయలో చెక్కును ఇస్తున్న దొన్నుదొర

గ్రంథాలయంలో పాటల పోటీలు

ప్రజాశక్తి–దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్ కళాశాల,బాలికల పాఠశాల విద్యార్థులు సుమారు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత, ఓస్ కె సుబ్బారావు విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అప్పలస్వామి మృతి బాధాకరం

కుటుంబ సభ్యులకు సిపిఎం నేతల పరామర్శ

అప్పలస్వామి కుటుంబీకులను పరామర్శిస్తున్న గంగరాజు, అప్పలనర్స

ప్రజాశక్తి –హుకుంపేట: మండల కేంద్రంలోని సిపిఎం కాలనీలో నివసిస్తున్న సిపిఎం కార్యకర్త చొంపి అప్పలస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విచారకరమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్వగృహంలో పార్థివ దేహానికి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్పిటిసి ఈసరి గంగరాజు, విజయనగరం జోనల్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం నివాళి అర్పించారు.ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, అప్పలస్వామి 2002–2003 కాలంలో సిపిఎం కార్యకర్తగా అనేక ఉద్యమాల్లో, ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నట్టు చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ, అప్పలస్వామి అకాల మరణం కుటుంబానికి మాత్రమే కాదు, పార్టీకి, గ్రామానికి కూడా తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కృష్ణారావు, రామారావు, కృష్ణమూర్తి ఉన్నారు.

కేంద్ర సాధికారత మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ పర్యటన

ప్రజాశక్తి –పాడేరు: భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ జస్బీర్ సింగ్ బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో 'ది ఎబిలిటి పీపుల్ సంస్థ' అధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరములను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగు లకు ఉపకరణము పంపిణీ చేసారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవిత కేంద్ర కేంద్రం సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. బాల సదనంను సందర్శించి వివరములు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు హేమలత దేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాల్గొన్నారు.

బరువును పరిశీలిస్తున్న డిప్యూటీ సెక్రటరీ

శిశువుల మృతిపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి–ముంచింగిపుట్టు: మండలంలోని దారెల గ్రామ పంచాయతీ చివుకుచింత, డి కుమ్మరి పుట్టు, తలింబ గ్రామాలకు చెందిన నవజాత శిశువులు ఆరుగురు మృతి చెందడంపై వార్త కథనాలకు బుధవారం జిల్లా కలెక్టర్ దారేల పంచాయతీ లో పర్యటించారు... నవజాత శిశువులు మృతి చెందిన విషయంపై బాధిత కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చిత్తశుద్ధితో విధి నిర్వహణ చేయాలని తెలిపారు. నవజాత శిశు మరణాలు కారణం స్పష్టంగా తెలుపాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలు వైద్య చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాలని, వైద్యుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. బర్త్ వెయిటింగ్ హోమ్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జనాభా లెక్కలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

ప్రజాశక్తి – జి.కె. వీధి : 2027 జనాభా లెక్కల కోసం జరుగుతున్న ముందస్తు పరీక్ష కార్యక్రమాన్ని కేంద్రహోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారి డాక్టర్ వి.వి.ఎల్.ఎన్. శర్మ క్షేత్రస్థాయిలో బుధవారం పర్యవేక్షించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ జి.కె. వీధి మండలంలోని నూతిబంద గ్రామానికి విచ్చేశారు. ప్రజలు, సిబ్బందితో డాక్టర్ శర్మ నేరుగా మాట్లాడారు. జనాభా లెక్కల ప్రశ్నపత్రం, గణన పద్ధతులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను గురించి సిబ్బంది నుండి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సంభాషణ ద్వారా ప్రీ–టెస్ట్‌లో గుర్తించిన లోపాలను ప్రధాన లెక్కల కార్యక్రమం ముందు సరిదిద్దడానికి వీలు కలుగుతుంది. పాడేరు ఆర్డిఒ, ఎడి సర్వే అధికారులు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఏ ఒక్క ప్రాంతం కూడా మిస్ కాకుండా ఉండేలా, జనాభా నివసించే ప్రాంతాలు మ్యాప్‌ల్లో సరిగ్గా నమోదయ్యాయో లేదో ధ్రువీకరించారు. జనాభా లెక్కల ఖచ్చితత్వం, పరిపాలనా యూనిట్లతో డేటాను అనుసంధానించ డానికి మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని డాక్టర్ శర్మ అన్నారు.

మాట్లాడుతున్న శర్మ

తుపాకుల మోతతో..

దద్దరిల్లుతున్న దండకారణ్యం..

- రెండు రోజుల్లో 13 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్
- బిక్కుబిక్కుమంటున్న మన్యం వాసులు

ప్రజాశక్తి - రంపచోడవరం : మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వరస ఎన్‌కౌంటర్లతో గిరిజనులు బిక్కుబిక్కుమంని గడుపుతున్నారు. మంగళవారం ఉదయం భద్రత దళాలు పోలీసుల మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టుల మృతి చెందగా బుధవారం ఉదయం మళ్లీ జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. దీంతో ఒక రోజు వ్యవధిలో సుమారు 13 మంది ఎన్‌కౌంటర్‌కు గురి కావడంతో మన్యం వాసుల గుండెల్లో గుబులు మొదలైంది. ఎన్నడూ లేని విధంగా మన్యంలో ఒక్కసారిగా తుపాకులు మొదలు వినిపించ డంతో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందని భయంతో బిక్కు బిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. గడిచిన సంవత్సరకాలంలో సుమారు ఈ ప్రాంతంలో కేంద్ర కమిటీ సభ్యులు ఏడుగురు, దళసభ్యులు 11 మంది వరకూ మృతి చెందారు. దీని ప్రభావం రానున్న కాలంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న టూరిజంపై కూడా తీవ్ర స్థాయిలో పడే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన హిడ్మా అతని భార్య రాజాల మతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించనున్నారు. మిగిలిన నలుగురు, బుధవారం మృతి చెందిన ఏడుగురికి రేపు పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. హిడ్మా అతని భార్య మృతదేహాలను తీసుకెళ్ళేందుకు రాజా సోదరి సోదరుడు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. మావోయిస్టుల మృతదేహాలను చూసేందుకు వారి బంధువులతో మాట్లాడేందుకు మీడియాకు అనుమతి ఇవ్వడం లేదు.

సంఘటనా స్థలం వద్ద నుంచి మృతదేహాలను తరలిస్తున్న పోలీస్‌సిబ్బంది

అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయాలి

- ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐ.వి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపువెంకట్

ప్రజాశక్తి– చింతూరు: ఈ నెల 24వ తేదీన చింతూరు డివిజన్ కేంద్రంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభకు, ప్రజాకళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐ.వి. పిలుపునిచ్చారు. బుధవారం చింతూరు ప్రజానాట్యమండలి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సోడె దుర్గారావు అధ్యక్షతన జరిగిన, జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల హక్కుల కోసం, వారి సంస్కృతి సంప్రదాయాల రక్షణ కోసం, తమ జీవితాలను త్యాగం చేసిన, అమరవీరులను స్మరించుకోవడానికి జరుగుతున్న "అమరవీరుల సంస్మరణ సభ"కు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా నాయకులు సిహెచ్ సుబ్బారావు, కారం కన్నారావు, పత్రా రమేష్, కొరసా రవి, మోసం హరీష్, చిలకం పవన్ కుమార్, సున్నం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్

సిపిఎం అమరవీరుల సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం చింతూరులో జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ 1980 కాలంలో బిపిఎల్ లాంటి సంస్థలు ఆదివాసులను దోపిడీ చేస్తున్న క్రమంలో ఎర్రజెండా చేతబట్టి గిరిజనుల ఐక్యం చేసి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసి నేలకొరిగిన వీరులు అనేకమంది ఉన్నారని, వారిని స్మరించుకునేందుకు ఈనెల 24న అమరవీరుల సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభను అందరూ జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీసం సురేష్, ఐవి, చింతా రాంబాబు, మొట్టం రాజయ్య, పత్రా రమేష్, సోడి దుర్గారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐవి

విఆర్‌పురం: ప్రభుత్వరంగ కార్మికులకు కనీస వేతనం.అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ గొర్రె రాజు డిమాండ్ చేశారు. సిఐటియు మండల కమిటీ సమావేశం రేఖపల్లి బొప్పెన భీమయ్య కార్యాలయంలో సిఐటియు మండల సభ్యులు కనక మహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గొర్రె రాజు మాట్లాడుతూ ఈ నెల 24న జరుగుతున్న అమరవీరుల సంస్మరణ సభకు ప్రతి ఒక్కరు హాజరు కావాలన్నారు. అదేవిధంగా జాతీయ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు ఉంటాయని వాటిని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, సిఐటియు మండల అధ్యక్షురాలు రాజేశ్వరి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

ప్రజాశక్తి– చింతూరు:: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్సి విభాగాల్లో స్పాట్ అడ్మిషన్లు నవంబర్ 24 వరకు కళాశాలలో జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్.కె.రత్న మాణిక్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్షలలో ఉత్తీర్ణులై డిగ్రీలో అడ్మిషన్లు పొందగోరువారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడ్మిషన్ కోసం వచ్చే అభ్యర్థులు ఎస్ఎస్‌సి మార్క్స్ మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9949693880, 7036883858 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

అన్నదాత సుఖీభవ, పిఎంకిసాన్ నగదు జమ

ప్రజాశక్తి– చింతూరు: మండలంలో 2807 మంది రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ రెండో విడత, పిఎం కిసాన్ కింద 1కోటి 94లక్షల 73వేలు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయి. మండలంలో చింతూరు చదలవాడ, ఏజీ కోడేరు, ఏడుగురాళ్ళ పల్లిలో కేంద్రాలు జెసి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచారు. చింతూరు కేంద్రాన్ని ఎంపిపి సవలం అమల ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రత్నప్రభ, సొసైటీ చైర్మన్ చిట్టిబాబు, మార్కెటింగ్ కమిటీ మెంబర్ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిషన్ రెండవ విడతలో భాగంగా రైతులకు నగదు బుధవారం జమ చేశారని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని దారెల గ్రామ పంచాయతీ సచివాలయంలో లబ్ధిదారులతో ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 7599 మందికి 3కోట్ల79లక్షల 95 వేల రూపాయలు, పీఎం కిసాన్ ద్వారా 7643 మందికి 1కోటి52లక్షల86 వేల రైతులకు సాయం అందించామన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యం బాగానే ఉంది

ప్రజాశక్తి – కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లో చదువుతున్న 40 విద్యార్థులను గాను మంగళ వారం 23 మంది బుధ వారం 10 మంది విద్యార్థులు పిహెచ్‌సి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. రాజేంద్రపాలెం పిహెచ్‌సిలో ఇంకా నలుగురు ఉన్నారు. వారి ఆరోగ్యం కూడా బాగానే ఉందని రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యాధికారి తెలిపారు. విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల గురించి కొయ్యూరు ఏటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ డాక్టర్ సంపత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

కెజిహెచ్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటిడబ్ల్యుఒ క్రాంతికుమార్

120 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి– చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు, చింతూరు సబ్ డివిజన్ ఎస్డీపిఒ బి.హేమంత్ ఆధ్వర్యంలో చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా ఒడిశా నుండి ఎపికి బొలెరో వాహనంలో తవుడు బస్తాల కింద పెట్టి అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల గంజాయి ని బుధవారం సాయంత్రం ఎర్రంపేటలోని ఒరిస్సా(మోటు) రోడ్ జంక్షన్‌లో స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులు బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్, మల్కనగిరి జిల్లాలోని 71 క్యాంపునకు చెందినవారని వీరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు ఆరు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి

విహార యాత్రలో విషాదం

ప్రజాశక్తి– మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోర్‌బై గ్రామం వద్ద , పవర్ కెనాల్‌లో ప్రమాదవశాత్తూ పడి పర్యాటకుడు గల్లంతు అయ్యాడు. వివరాల్లోకి వెళితే ఎలమంచిలి గ్రామానికి చెందిన గనిశెట్టి జగదీష్(26) స్థానికంగా మెకానిక్‌గా పని చేస్తున్నారు. అతని స్నేహితులు బి.చిరంజీవి, కే.భాను, ఆర్.రాందేవ్, పి.నరేంద్ర, బి.హరి, మొత్తం ఆరుగురు స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చారు. ప్రమాదవశాత్తు పవర్ కెనాల్ లో పడి గల్లంతయ్యాడు. మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కోసం గాలిస్తున్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి–జికెవీధి : మండలంలోని రింతాడ పంచాయతీ పరిధి గొడిచింత గ్రామంలో జెడ్పీ నిధులు 3 లక్షల వ్యయంతో 75 మీటర్ల డ్రైనేజీ పనులకు సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఎంపిపి బోయిన కుమారి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, టిడిపి మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేనపార్టీ పంచాయతీ అధ్యక్షులు కొయ్యం ఇమ్మాన్యుయెల్, ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి– చింతూరు : పేదల అభివృద్ధి కోసం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నిరంతర శ్రమించారని ఆమె సేవలు మరువలేవని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ అహ్మద్ అలీ కొనియాడారు, బుధవారం చింతూరులో ఇందిరాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోడి కృష్ణమూర్తి. ఎక్స్ ఎంపీటీసీ అక్బర్ కన్నారావు, సోయం బొక్కిలి ప్రసాద్, ఎండి జోహార్, బొక్కిలి శ్రీరాములు, నరేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ గొడౌన్ ప్రారంభం

ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కాశీపట్నం:మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీ వద్ద సాగర్ సిమెంట్ గొడౌన్‌ను బుధవారం కూటమి నాయకులతో కలిసి జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ దీసరి గంగరాజు, ఎంపీపి శెట్టి నీలవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, అందుబాటులో ధరలో సాగర్ సిమెంట్ గొడౌన్ ఏర్పాటు చేసిన దేముడమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అనంతగిరి సర్పంచ్ సోమేల రూతు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, ఎగువశోభ సర్పంచ్ కొర్ర సింహంద్రి, టీడీపీ సీనియర్ నాయకులు మొస్య రంజిత్, మట్టం శ్యామ్, రమేష్, సిపిఎం నాయకులు దేవన్న పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-పెదబయలు : పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులను ప్రసూతి గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శీతాకాలంలో న్యూమోనియా వ్యాధి తీవ్రంగా వ్యాప్తిచెందే అవకాసం ఉన్నదని, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లల్లోను, వృద్ధులలో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వ్యాధి వ్యాప్తిచెందే అవకాసం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చిన్నారుల్లో న్యూమోనియా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ముందుగానే అవగాహన కలిగి తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. జిల్లాలో శిశు మరణాలు అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో చిన్నారులు, రోగులు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం అందక మరణిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారిణి సత్యశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

రగ్గులు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి గిరిజన గ్రామాలకు చెందిన 50 కుటుంబాలకు రగ్గులను మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ సంస్థ ప్రెసిడెంట్ ప్రసాద్ పట్నాయక్ పంపిణీ చేశారు. తేనెపుట్టు, తెల్లరపాడు, నందిగుమ్మి, మద్దిగరువు, రేగం, రాజుపాక, డెకపురం గ్రామాలకు చెందిన 50 పేద కుటుంబాల వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ, చలి కాలం దృష్టిలో పెట్టుకుని రగ్గులు, దుస్తులు. పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ జోగులు, చిలకలగెడ్డ మండల పరిషత్ ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు, గిరిజన సంఘం మండల నాయకులు ఎస్.నాగులు పాల్గొన్నారు.

వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన రాతి కట్టు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కించుమండ వారపుసంతకు అనుకుని ఉన్న పరిశీల రోడ్డు సంపంగి గడ్డ వంతెన వద్ద నిర్మించిన రాతికట్టు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ వంతెన నిర్మించి సుమారు ఆరు నెలలు కాకముందే రాతి కట్టు కొట్టుకు పోవడంతో ఆ ప్రాంత గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన సంపంగి గెడ్డకు ఇరువైపులా నిర్మించిన పిల్లర్స్ కు రక్షణగా గట్టిగా ఉండడానికి మట్టిని వేసి పైన రాతికట్టులను కట్టారు. ఆ రాతికట్టును నాసిరకంగా నిర్మించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ పొంగి ప్రవహించడంతో రాతికట్టు కొట్టుకు పోయింది. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఈ వంతెనను నిర్మించారు. అయితే నాసిరకంగా రాతికట్టు నిర్మించడం వల్ల వంతెన ఏమైనా సౌకర్యానికి మళ్లీ ఇబ్బందులు పునరావతం అవుతాయని పరిశీల ప్రాంత గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనకు అనుకుని కించుమండ, కితలంగి పంచాయితీ గ్రామాలతో పాటు అరకులోయ మండలంలోని పలు గ్రామాలు ఉన్నాయి.
ఈ గ్రామాలకు రాకపోకలు చేయడానికి రవాణా సౌకర్యానికి ప్రధానమైంది ఈ వంతెన ఈ సంపంగి గెడ్డపై గతంలో నిర్మించిన కాజ్వే ఏడాదిలోపే గెడ్డ ఉద్రుతికి కొట్టుకు పోయింది. మళ్లీ ఈ వంతెన కూడా మరమ్మతుకు గురైతే రవాణా సౌకర్యానికి తమ పరిస్థితి ఏ విధంగా ఉంటుందని

కొట్టుకు పోయిన వంతెన రక్షణ రాతి కట్టు

గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన లేకపోతే ఆ గ్రామాలకు వర్షాకాలంలో రవాణా సౌకర్యం పూర్తిగా స్తంభించుకుపోతుంది. దీంతో ఆ ప్రాంత గ్రామాల గిరిజనులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వర్షాలకు కొట్టుకు పోయిన రాతికట్టును నాణ్యతగా నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

తుపాన్‌కు కొట్టుకుపోయిన రహదారి

దెబ్బతిన్న రహదారి మార్గం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మారుమూల పటకదవడ పిటిజీ గ్రామ రహదారి తుపానుకు తీవ్రంగా దెబ్బతింది. అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ బియ్యం తెచ్చుకోవడం, అత్యవసర సేవలు పొందడం, గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో జాకరవలస- తుంబనవలస- పటకదవడ పిటిజీ వరకు రహదారి నిర్మాణానికి కోట్లు రూపాయలు మంజూరు చేసినప్పటికీ, ఇంజినీరింగ్ అధికారుల అజాగ్రత్త, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని గ్రామస్థులు ఆరోపించారు. సుమారు 8 కిలోమీటర్ల రహదారి పూర్తయితే పటకదవడ పిటిజీ గ్రామానికి శాశ్వత రహదారితో పాటు, బూర్జ పంచాయతీ కేంద్రంతో అనుసంధానం సులభమయ్యేదని వారు చెబుతున్నారు. బూర్జ పంచాయతీ హుకుంపేట మండల కేంద్రానికి 60నుంచి 70 కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అభివృద్ధిలో తీవ్ర వెనుకబాటు ఎదురవు తోందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పెదబయలు : గోమంగి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ గోమంగి మండల సాధన సమితి నాయకులు బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కమార్‌కు వినతిపత్రం అందజేశారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ వన్నడ గ్రామంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బుధవారం సందర్శించిన సందర్భంగా మండల సాధన సమితి నాయకులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోమంగి సర్పంచ్ కొర్ర జెట్టో, ఎంపిటిసి పురుషకరి భాస్కరరావు, నాయకులు గంపరాయి ధనుంజయ్, పాంగి సింహాచలం, కూడా మత్స్య కొండబాబు, గంపరాయి రవి వర్మ, పాంగి అన్నాజీ, కామేష్, కుంబిడి మేఘరాజు, పాంగి సింహాచలం, గంపరాయి అచ్చిబాబు, గంపరాయి కార్తీక్ రాజ్, కూడ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విశాఖ వ్యాలీ స్కూలు దరి ప్రభుత్వ బాలికల గృహంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. విద్యార్థినులకు క్షయ వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలపై వైద్యులు అవగాహన కల్పించారు. వైద్యుల పర్యవేక్షణలో బాలికలకు రక్త పరీక్షలు చేసారు. అనంతరం కౌన్సిలర్ పద్మజ బాలికలతో మాట్లాడుతూ పాజిటివ్ థింకింగ్‌పై అవగాహ కల్పించారు. కార్యక్రమంలో బాలికల గృహం పర్యవేక్షణాధికారి సి.నయోమి, వైద్యాధికారిణి డాక్టర్ వి.భోభారాణి, మధురువాడ టిబి యూనిట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి భీమునిపట్నం : జివిఎంసి 2,3 వార్డుల్లో శ్మశానవాటిక కాంపౌండ్ వాల్, బర్నింగ్ ప్లాట్ ఫామ్స్, 195 మీటర్ల సిసి రోడ్డును జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారంపరిశీలించారు శ్మశాన వాటికలో విద్యుత్ దీపాలు, వెయిటింగ్ హాల్, అస్తికలు భద్ర పరుచుకునేందుకు లాక్ రూమ్,కేర్‌టేకర్, వాచ్‌మెన్ నియామకం చేయాలని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి కమిషనర్‌ను కోరారు మూడోవార్డు గొల్లలపాలెం నుంచి కస్తూర్బా బాలికా విద్యాలయం రోడ్డును పరిశీలించారు జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, డిఇఇ సురేష్, పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అప్రమత్తత

అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్స్, గంజాయితో అనర్థాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ హిమగిరి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి మత్తుకు బానిస కావద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కే పాపినాయుడు, ప్రిన్సిపల్ ఎం వెంకటస్వామి నాయుడు, అధ్యాపకులు అప్పలనాయుడు, కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు

తుప్పలు తొలగిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:.మండలంలోని గుంటసీమ రోడ్డు జంక్షన్ నుండి ఖంద్రుమ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కె హరి ఆధ్వర్యంలో బుధవారం తొలగింపు చేపట్టారు. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా తుప్పలను తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పాత కరాస బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర స్వామి కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా బుధవారం అన్నసమారాధనను నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. కరాస రామాలయం వద్ద అన్నసమారాధనలో 1500 మంది భక్తులు పాల్గొన్నారు..కార్యక్రమంలో నగిరెడ్డి రమణా రెడ్డి, బేరి హరికృష్ణారెడ్డి, గోపి రెడ్డి, దివాకర్, స్తానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నసమారాధనలో పాల్గొన్న జియ్యానిశ్రీధర్

మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు స్వతంత్రనగర్ సాయి లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధనను ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు స్వామికి108 కేజీల ప్రత్యేక అన్నంతో అన్నాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు.

మాట్లాడుతున్న గాంధీబాబు

బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: బాలల హక్కుల సంరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం అని గాంధీబాబు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యంలో బుధవారం బాలల దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీబాబు మాట్లాడుతూ, పిల్లలు విద్య, ఆరోగ్యం, రక్షణ వంటి అంశాల్లో పూర్తి అవకాశాలు పొందేలా సామాజిక అవగాహన పెంపొందించడమే కాదు, కార్యాచరణలో క్రమబద్ధత అవసరమని ఆయన సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వి.ఆర్.పురం మండల తహశీల్దార్ సరస్వతి మాట్లాడారు. పలు రంగాల్లో సేవలందించిన 61 మందికి మెమెంటోలు, అభినందనా పత్రాలు అందజేయగా, ఎఎస్‌డిఎస్ అధినేత గాంధీబాబు అందరినీ అభినందించారు. జెడ్‌పిటిసి రంగారెడ్డి, ఎఎస్‌డిఎస్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, వి.ఆర్.పురం ఎస్ఐ సంతోష్ అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ముల్లూరు గ్రామస్తులు

ముల్లూరు గ్రామాన్ని 41 కాంటూరులో చేర్చండి

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని ముల్లూరు గ్రామాన్ని 41 కాంటూరులో చేర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి సంబంధించిన స్ట్రక్చర్ వేల్యూ తక్షణం నిర్ణయించి ప్రభుత్వం నుండి అందాల్సిన ఆర్అండ్ఆర్ రాయితీలని అందించాలన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చింతూరు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులను నియమించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య అధికారులను తక్షణమే నియమించాలని వైసిపి ఎంపిటిసి పిల్లా సర్పంచ్ పాంగి దుర్జో సాంబమూర్తి సీలేరు టౌన్ వైసిపి అధ్యక్షుడు పేలూరి సత్యనారాయణ (బుజ్జి) డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య ఇటీవల సీలేరు పిహెచ్ నుంచి అధికారులు బదిలీ చేశారని పేర్కొన్నారు. వారి స్థానంలో వైద్యాధికారులని నియమించలేదని, సిబ్బంది కొరత కారణంగా వైద్యసేవలు అందడం లేదని పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దినేష్ కుమార్ డిఎంహెచ్ఒ స్పందించి వైద్యాధికారులని పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి నాయకులు వెంకటరావు, నూకరాజు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన జిల్లా విద్యార్థులు

చింతూరు: సాయితేజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి : సర్టిఫికెట్ తీసుకుంటున్న వారాత్రి సుశాంత్

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో..

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని మారుమూల గ్రామం అనంతగిరికి చెందిన వారాత్రి సుశాంత్ ఒరిస్సాలో జరిగిన అండర్ 19 జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 120 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి సత్తా చాటాడు. సుశాంత్ రాజవొమ్మంగి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సుశాంత్ తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు అభినందించారు.

సత్తా చాటిన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గుండి సాయి తేజ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన అండర్ 14 వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికై నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్టు హెచ్ఎం భీమయ్య తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం సాయితేజను, పిడి ఇంద్రరెడ్డిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బోర్నగూడెం విద్యార్థి

రాజవొమ్మంగి: రాష్ట్రస్థాయి పోటీలకు బోర్నగూడెం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రమేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ నెల18న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో దుర్గాప్రసాద్ పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, ఈ నెల 20న నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నట్లు తెలిపారు. ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మర్రి కామేష్ కూడా మంచి ప్రతిభ కనబరిచాడు. బుధవారం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పిడి ధర్మరాజును హెచ్ఎం రమేష్‌బాబు, తదితరులు అభినందించారు.

పెట్రోల్‌బంక్ రికార్డులు తనిఖీచేస్తున్న వెంకటేష్

గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా హెచ్‌పి గ్యాస్ సిలిండర్ ధరల పట్టిక గోదాము ముందు అతికించాలని జిసిసి డిఎం పి.వెంకటేష్ స్థానిక గ్యాస్ గోడామ్ ఇన్చార్జి బంగారయ్యను ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరులో డిసిసి డిఎం బుధవారం విస్తృతంగా పర్యటించారు. గ్యాస్ గోడౌన్‌రికార్డులు తనిఖీ చేశారు. అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని, వినియోగదారులు నుంచి అదనంగా డబ్బులు వసూలు చేసినట్లు తమకి మళ్లీ ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పెట్రోల్ బంకు రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

హోటళ్లు, ఫుడ్‌మెటీరియల్ షాపులు తనిఖీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో హైవే ప్రక్కన ఉన్న హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, స్వీట్స్ స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ ఆదేశాల మేరకు బుధవారం ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. శానిటేషన్,హైజిన్ మెయింటనెన్స్ నిర్వహణ ఎలాఉందో పరిశీలించారు. నిల్వ ఉంచిన పదార్థాలు విక్రయించరాదని హెచ్చరించారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

5వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:మండలంలో సొసైటీ ద్వారా ప్రభుత్వ ఈ ఖరీఫ్ లో కొనుగోలు కేంద్రాల వద్ద 5వేలు టన్నులు ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యమని సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్ అన్నారు. బుధవారం రాజవొమ్మంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు కేశవ్ తదితరులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ.రైతులు వద్దనుండి ధాన్యం పారదర్శకంగా కొనుగోలు జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన రోజునే సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజవొమ్మంగి,జడ్డంగి, శరభవరం, కొమరాపురం, దూసరపాము,లబ్బర్తి గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గురుకుల పాఠశాలలో వనసమారాధన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి సిబ్బంది ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించి న నత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిటిసి కనిగిరి గంగాధర్గా, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, ఎస్ఐ శివకుమార్, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

రోగులకు పళ్లు పంచుతున్న చిట్టిబాబు తదితరులు

ఘనంగా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-జీకేవీధి : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) వ్యవస్థాపకులు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రవితేజ ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా అధ్యక్షులు పనసల చిట్టిబాబు ఆధ్వర్యంలో జాప్ ఆవిర్భావ దినోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జికె వీధి మండల ఆర్‌వినగర్‌లో పిహెచ్‌సిలో పేషెంట్లకు పాలు, పళ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జీకే వీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల యూనియన్ విలేకరులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్స్ తో బాలిక మృతి

ప్రజాశక్తి- చింతూరు: మండలంలోని పెద్దసీతనపల్లి గ్రామానికి చెందిన శ్యామల రమాదేవి, మారయ్య దంపతుల కుమార్తె శ్యామల జనని (5) కుయుగురు గ్రామంలో ఉంటున్న తన అమ్మమ్మ గారి ఇంట్లో నివసిస్తూ ఉంది. బుధవారం ఏడు గంటల సమయంలో ఇంటి వద్ద భోజనం చేసి, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తూ దారిలో రేగుపళ్ళు తిని, తోటి పిల్లలతో ఆడుకుంటూ, అక్కడ ఫిట్స్ వచ్చినట్లు పడిపోయిందని, అంగన్‌వాడీ కార్యకర్త రవ్వ కళావతి, పాప అమ్మమ్మ దుర్గమ్మకు సమాచారం తెలపగా వెంటనే తమ బంధువులతో కలిసి ఆటోలో చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అప్పటివరకూ ఆడుకుంటున్న పాప అకస్మాత్తుగా కన్నుమూసేసరికి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. చింతూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇమామి కేశ్ కింగ్ గోల్డ్ పరిచయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెయిర్ కేర్‌లో కేశ్ కింగ్ బ్రాండ్ కేశ్ కింగ్ గోల్డ్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల బ్రాండ్ ఒక కొత్త గుర్తింపు పొందిందని ఆ సంస్థ ప్రతినిధి ప్రీతి ఎ సురేఖ విశాఖపట్నంలో చెప్పారు. ఈ రీ బ్రాండింగ్‌తో సంప్రదాయ మూలాలను దాటి ఒక శక్తివంతమైన కొత్త ప్రతిపాదన స్వీకరించిందని, ఆయుర్వేదం ప్లస్ విజ్ఞానం దీంతో అందుతుందని పేర్కొన్నారు.

22 వరకూ ఇంపాజిబుల్ ట్రావెల్ డీల్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విమానాలు, హోటల్ బుకింగ్స్‌పై గణనీయమైన ఆదాను ప్రజలకు అందించే ఉద్దేశంతో అమెజాన్ పే తమ ఫ్లాగ్ షిప్ 'ఇంపాజిబుల్ ట్రావెల్ డీల్స్'ను బుధవారం ప్రకటించింది. నగరంలోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ రీజనల్ మార్కెటింగ్ హెడ్ వికాస్ బన్సల్ మాట్లాడుతూ ఈ నెల 18 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు విమానాలపై 20 శాతం వరకు తగ్గింపును, హోటళ్లపై 60 శాతం వరకు తగ్గింపును అందిస్తోందన్నారు. ఢిల్లీ-లండన్‌కు రూ. 16,999కి, చెన్నై- సింగపూర్‌కు రూ.6,999, ముంబయి-దుబాయ్ రూ.8,999కి పరిమిత సమయం ఆఫర్లుగా ఉన్నాయని వివరించారు. ట్రెండింగ్ గమ్యస్థానాలైన థాయ్‌లాండ్‌కు రూ. 6,599, బాలికి రూ.10,999 ఈ ఏడాది అతి తక్కువ ధరలకు పొందవచ్చని పేర్కొన్నారు. డొమెస్టిక్ రూట్స్‌లో ఢిల్లీ నుండి రూ.3,099, గోవా నుండి రూ.2,999కి, బెంగళూరు నుండి రూ.2,199 విమానల టిక్కెట్ల ధరలు కలిపి ఉన్నాయన్నారు.

21న మార్కెట్‌లోకి మెటా రే-బాన్ స్మార్ట్ గ్లాసెస్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వినియోగదారులు ఎంతగానో ఎదురు చూస్తున్న మెటా రే-బాన్ స్మార్ట్ గ్లాసెస్ అమ్మకాలు నవంబర్ 21 నుంచి ప్రారంభం కానున్నాయని అమెజాన్ ఇండియా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ జేబా ఖాన్ తెలిపారు. బుధవారం విశాఖపట్నం సిరిపురంలోని వివాన్ హోటల్‌లోఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త స్మార్ట్ గ్లాసెస్ ప్రీమియం వేరబుల్స్ శ్రేణిలోకి వస్తాయని వీటిని టెక్ ఔత్సాహికులు, క్రియేటర్లు ఆసక్తిగా అనుసరిస్తున్నారన్నారు.